క్లుప్తంగా

గంజాయి తరలిస్తున్న యువకుల అరెస్ట్?

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరం సమీపంలో నిషేధిత గంజాయి సరఫరా చేస్తున్న ముగ్గురు యువకులను పోలీసులకు పట్టుకున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం భూపాలపల్లికి చెందిన ఇద్దరు, మహదేవపూర్ మండలం మద్దులపల్లికి చెందిన ఒకరు మహారాష్ట్ర నుంచి గంజాయి కొనుగోలు చేసి జిల్లాలోని కాళేశ్వరానికి రాగా, అక్కడ అంతర్రాష్ట్ర వంతెన వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తున్నారు. వారిని నిలిపి సోదాలు చేయగా వారి వద్ద కిలోకుపైగా గంజాయి లభించినట్లు సమాచారం. దీంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. కాగా ముగ్గురు యువకులు జిల్లాలోని ఓ ఐటీఐ కాలేజీలో చదువుతుండడం గమనార్హం. పోలీసులు ఈవిషయాన్ని బయటికి రాకుండా గోప్యత పాటిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

చిట్యాల: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ షేక్ ఇమామ్‌బాబా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే పశువులను విద్యుత్ స్తంభాలకు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉంచాలన్నారు. వరదలు సంభవించిన లేదా సాయం కోసం తహసీల్దార్ కార్యాలయం 88976 22300 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

వాహనం ఢీకొని..వ్యక్తి మృతి


మల్లయ్య (ఫైల్)

రేగొండ : కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై దివ్య తెలిపారు. మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద రఘుసాల మల్లయ్య (58) రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి టాటాఏస్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లయ్యకు గాయాలు కావడంతో పరకాలలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తమ్ముడు నరహరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దివ్య తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు..



చిట్యాల : విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని గిద్దెముత్తారంలో బుధవారం చోటు చేసుకుంది. గిద్దెముత్తారం గ్రామానికి చెందిన రైతు పంచిక గట్టయ్యకు చెందిన ఎద్దు గ్రామ శివారులో మేతకు వెళ్లింది. ఈ క్రమంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పక్కన మేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. మృతి చెందిన ఎద్దు విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు రైతు గట్టయ్య రోదిస్తు వేడుకున్నాడు.

అంగన్‌వాడీ టీచర్ ఆత్మహత్యాయత్నం

కన్నాయిగూడెం : మండలంలోని బుట్టాయిగూడెం పరిధి కొత్తూరు గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ కుమ్మరి శాంతి ఎలుకల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. కొత్తూరులో అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తున్న కుమ్మరి శాంతి భర్త నాగేశ్వర్‌రావు ప్రజా పాలన గ్రామసభలో తనకు ఇందిరమ్మ ఇళ్ల లిస్టులో పేరు రాలేదని మృతిచెందిన సంఘటన తెలిసిందే. కాగా బుధవారం ఇంటి వద్ద ఉన్న ఎలుకల మందును తాగి, అంగన్‌వాడీ సెంటర్‌కు వచ్చి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన చుట్టుపక్కల వారు108లో ఏటూరునాగారం తరలించగా మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తీసుకువెళ్లి వైద్యం చేయిస్తున్నట్లు తెలిసింది. కాగా శాంతి ఆత్మహత్యా యత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ముగ్గురిపై కేసు

ములుగు రూరల్ : పశువులను అక్రమంగా తరలిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు. బుధవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టగా అక్రమంగా డీసీఎం (టీఎస్ 12యూసీ 4656) వాహనంలో 11పశువులను తరలిస్తున్నారని చెప్పారు. డ్రైవర్, వాహన యజమాని, పశువులు తరలిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసి పశువులను గోశాలకు తరలించారు.

సన్మానం

ములుగు రూరల్ : జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన డాక్టర్ మోహన్‌లాల్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్వర్‌ను సన్మానించారు. ఈ మేరకు బుధవారం మెడికల్ కళాశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన స్వర్ణలత, ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ వారికి పూలబొకే అందించారు.

బాబోయ్.. వానరాలు

- బయటకు వెళ్లేందుకు జంకుతున్న జనాలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు


తాడిచర్లలో ఇంటిపై చేరిన వానరాలు

మల్హర్ : అడవిలో ఉండాల్సిన వానరాలు మండలంలోని పలు గ్రామాల్లో స్వైరవిహారం చేస్తూ నిత్యం ప్రజలకు నరకాన్ని చూపిస్తున్నాయి. కోతుల ఆగడాలకు అంతులేకుండా పోయింది. ఇంట్లో ఉన్నా, వీధుల్లోకి వెళ్లిన జనాలు బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇంట్లో అయితే మాత్రం తప్పనిసరిగా తలుపులు మూసి ఉండాల్సిందే. ఆదమరిస్తే అంతే సంగతులు. ఇళ్లలోకి చొరబడి అందిన వస్తువులు, పదార్థాలను ఎత్తుకెళ్లి తింటున్నాయి. ఇంటి పైనా పెంకులను తొలగిస్తున్నాయి. అదిలించేందుకు ప్రయత్నిస్తే మీదపడి గాయపరుస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిరాణా షాపులు, వ్యాపార ప్రదేశాల్లో కూడా దుకాణాల్లోని వస్తువులు ఎత్తుకెళ్తున్నాయి. రోడ్ల పక్కన, తోపుడు బండ్లపై కూరగాయలు, పండ్లు అమ్ముకునే చిరు వ్యాపారులు సైతం వీటి బారిన పడి నష్టపోతున్నారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులు వీధుల్లో తిరగాలంటేనే జంకుతున్నారు. చేతిలో కవర్ కనిపిస్తే లాక్కెళ్తున్నాయి. నిత్యం వందల సంఖ్యల్లో కోతులు ఇళ్లపై తిరుగుతూ బీభత్సం సృష్టిస్తున్నాయి. అధికారులకు మొరపెట్టుకుంటున్నా ఫలితం లేదని మండలవాసులు వాపోతున్నారు. తాడిచర్ల గ్రామ పంచాయతీ పాలకవర్గం దృష్టి సారించి వాటిని పట్టుకొని సమీప అడవుల్లో వదిలి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

చర్య తీసుకోవాలి



కోతుల బెడదతో నిత్యం నరకం అనుభవిస్తున్నాం. ఇళ్లలోకి చొరబడి అందిన వస్తువులు, పదార్థాలు ఎత్తుకెళ్తున్నాయి. అదిలించేందుకు వెళ్తే మీద పడి గాయపరుస్తున్నాయి. గ్రామ పంచాయతీ సిబ్బంది కోతులు రాకుండా చర్యలు తీసుకోవాలి.

– ఇందారపు రాజేష్, తాడిచర్ల, మల్హర్

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి


ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పద్మ

భూపాలపల్లి అర్బన్ : వానాకాలం నేపథ్యంలో సింగరేణి కార్మికులు డెంగీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని సింగరేణి ఆస్పత్రి హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పద్మ తెలిపారు. ఏరియాలోని కేటీకే 6వ గనిలో సీజనల్ వాధ్యులపై బుధవారం కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మ మాట్లాడుతూ.. వానాకాలంలో సీజనల్ వ్యాధులు, డెంగీ, మలేరియా వంటివి సంక్రమించే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. ముఖ్యంగా డెంగీ సంక్రమణ, దాని లక్షణాలు, జ్వరం రాకుండా సింగరేణి ఉద్యోగులు, కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కలుషితమైన నీరు, ఆహారం తీసుకొవద్దన్నారు. చేతులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గని సేఫ్టీ అధికారి నాగరాజు, సంక్షేమ అధికారి దీపపోదర్, అండర్ మేనేజర్ విక్రమ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

అన్నదాత ఆలోచన అదుర్స్..



గణపురం : వ్యవసాయ పనులు ప్రారంభం కావడంతో ట్రాక్టర్లకు కేజీవీల్స్ బిగించి పొలాల్లో నాట్లు వేయడానికి దమ్ము చేయడం తెలిసిందే. అయితే ట్రాక్టర్లు ఒక దగ్గర నుంచి మరో ప్రాంతానికి కేజీవీ ల్స్‌తో రోడ్లపై వెళ్తే రోడ్లు పూర్తిగా ధ్వంసమవుతున్నాయి. రోడ్లపై కేజీవీల్స్‌తో వెళ్లే ట్రాక్టర్లను సీజ్ చేయడంతో పాటు జరిమానా విధిస్తామని అధికారులు, పోలీసులు హెచ్చరిస్తున్నారు. దీంతో రోడ్లపై కేజీవీల్స్ తీసుకెళ్లడానికి టైర్లతో కూడిన మరో ట్రాక్టర్ ద్వారా తీసుకెళ్తున్నారు. దీంతో అన్నదాత కొత్త ఆలోచనను పలువురు అభినందిస్తున్నారు.

మహాలక్ష్మి పథకం సంబురాలు


దూదేకులపల్లి బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి బస్‌స్టేషన్‌లో బుధవారం మహాలక్ష్మి పథకం సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ .. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉచిత బస్సు పథకంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన స్కూల్, కళాశాల విద్యార్థులకు ఎమ్మెల్యే బహుమతులు అందించారు. ఉచితంగా ప్రయాణిస్తున్న ఐదుగురు మహిళలను సన్మానించారు. అనంతరం భూపాలపల్లి మండలంలో దూదేకులపల్లి వరకు నూతనంగా బస్సు సర్వీస్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, డిపో మేనేజర్ ఇందు, సూపర్‌వైజర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ బుక్స్ మీ సేవలోకి?

కాళేశ్వరం : మహాదేవపూర్ మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయలంలో చేపట్టాల్సిన ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను మీసేవ కేంద్రాల్లో నమోదు చేయడం ఏంటని, ఏఈఓలు నిర్లక్ష్యంగా వ్యవహరించంపై ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి మీ సేవ కేంద్రాల్లో చేస్తున్న రిజిస్ట్రేషన్‌లపై సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని బుధవారం ఆయన డిమాండ్ చేశారు.

వాహనాల తనిఖీ


కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

కాటారం : మహాముత్తారం మండలంలో బుధవారం ఎస్సై మహేందర్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానితులను ప్రశ్నించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టినట్లు తెలిసింది.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శి

కాటారం : విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీఓ వీరస్వామి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర సంక్షేమ కళాశాలను ఎంపీఓ తనిఖీ చేశారు. రికార్డులు, పరిసరాల పరిశుభ్రత, వంటగది, డైనింగ్ హాల్, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు.పరిసరాలతో పాటు కిచెన్, డైనింగ్ హాల్‌ను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. వర్షాకాలం తగిన జాగ్రత్తలు పాటిస్తూ విద్యార్థులకు భోజనం ఎప్పటికప్పుడు తయారు చేసి పెట్టాలని నిల్వ చేసిన పదార్థాలను వినియోగించవద్దని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల టీం వర్క్‌ను ఎంపీఓ అభినందించారు. ఎంపీఓ వెంట పంచాయతీ కార్యదర్శి షగీర్‌ఖాన్, ప్రిన్సిపాల్ రాజేందర్, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

భూపాలపల్లి అర్బన్ : ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) నాయకులు కోరారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మరింత మెరుగుపర్చాలని కోరారు. బదిలీలు, పదోన్నతులు నిర్వహించి ఖాళీలను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కొత్త కుమారస్వామి, అశోక్, సేవానాయక్, రమ, రమేష్, రాజు, గోవర్ధన్ పాల్గొన్నారు.

ఆడపిల్లల రక్షణ ప్రతీఒక్కరి బాధ్యత


సమావేశంలో మాట్లాడుతున్న అనూష

కాటారం : ఆడపిల్లల రక్షణ ప్రతీ ఒక్కరు బాధ్యతగా భావించాలని లింగ వివక్ష చూపకుండా ఆడ, మగను సమానంగా చూడాలని మహిళా సాధికారిత మిషన్ జిల్లా కోఆర్డినేటర్ అనూష సూచించారు. మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో బుధవారం వైద్యాధికారి మౌనిక ఆధ్వర్యంలో బేటి బచావో-బేటి పడావో పథకంపై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనూష మాట్లాడుతూ మహిళలు, బాలికల సంరక్షణ కోసం ప్రభుత్వాలు అనేక పథకాలు అమల్లోకి తీసుకొస్తున్నాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం బేటి బచావో-బేటి పడావో ద్వారా ఆడ పిల్లల రక్షణ, విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇద్దరు ఆడపిల్లలు ఉన్న తల్లితండ్రులు సుకన్య సమృద్ధి యోజన పథకం వినియోగించుకోవాలని తెలిపారు. ఉమెన్స్ హెల్ప్ లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నంబర్ 1930ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌ఈడబ్ల్యూ జెండర్ స్పెషలిస్ట్ మమత, మహిళలు, గర్భిణులు, బాలింతలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డీఏజేజీయూఏ పథకాన్ని వినియోగించుకోవాలి

కాటారం : మత్స్యశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న దార్తి ఆబా జన్‌జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం (డీఏజేజీయూఏ)ను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి విజయ్‌కుమార్ సూచించారు. మహాముత్తారం మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలోని 18 గ్రామాలు డీఏజేజీయూఏ పథకానికి ఎంపికై నట్లు తెలిపారు. ఈ నెల చివరిలోగా దరఖాస్తు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ శ్రీనివాస్, ఆయా గ్రామపంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


పాఠశాలలో విద్యార్థులతో రాజు

కాళేశ్వరం : మహదేవపూర్ మండల కేంద్రంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని, ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్ బంద్ నిర్వహించారు. మహదేవపూర్ మండల కేంద్రంలో ఇంటర్, డిగ్రీ చదువుకున్న విద్యార్థులకు తక్షణమే హాస్టళ్లు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

లింగాలలో వైద్యశిబిరం

ఎస్ఎస్‌తాడ్వాయి : మండలంలోని కొడిశాల పీహెచ్‌సీ పరిధి లింగాలలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ బాలు, హెల్త్ అసిస్టెంట్ సీతారాంనాయక్ జ్వరపీడితుల నుంచి రక్త నమునాలు సేకరించారు. తొమ్మిది మందికి ఆర్‌డీటీ పరీక్షలు నిర్వహించగా పాయం హేమలతకు పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్రలను సిబ్బంది సూచించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వారి వెంట ఆశ వర్కర్ మధురాణి ఉన్నారు.

బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం


మాట్లాడుతున్న శ్రీనివాస్

భూపాలపల్లి అర్బన్ : బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం యూనియన్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఏరియాలోని సింగరేణి గనుల పై యూనియన్ పతాకావిష్కరణ చేపట్టారు. కేటీకే 1వ గనిలో నిర్వహించిన కార్యక్రమానికి బీఎంఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పాని శ్రీనివాస్ హాజరై పతాకావిష్కరణ చేసి మాట్లాడారు. నాయకులు సుజేందర్, మల్లేష్, శ్రీరాములు, రాజయ్య, రాజు, పునీత్, నర్సింగరావు, రాజు, రమేష్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ములుగు రూరల్ : రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు బుధవారం కలెక్టర్ దివాకరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు జిల్లాలో అమలు కావడంలేదని అన్నారు. రైతు భరోసా ఎకరాకు రూ.15 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎరువులు, విత్తనాల సరఫరాలో ఎటువంటి జాప్యం లేకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్ రెడ్డి, సురేందర్, స్వరూప, రాజు, వాసుదేవి రెడ్డి, కుమార్ తదితరులు ఉన్నారు.

రోడ్డుపై గుంత.. తప్పదు చింత


రోడ్డుపై ఏర్పడిన భారీ గుంత

చిట్యాల : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుగుండా అనేక వాహనాలు వెళ్తుంటాయి. ఎదురుగా ఏదైనా వాహనం వస్తే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి గుంతల రోడ్డుకు మరమ్మతులు చేయాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

పల్లె దవాఖానాలో మెరుగైన వైద్యం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు


పల్లె దవాఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

రేగొండ : గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం కోసం పల్లె దవాఖానలు ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రూ.20 లక్షల నిధులతో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను ఆయన ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రిలో అందించే సేవలను వినియోగించుకోవాలన్నారు. అనంతరం మీనాక్షి నటరాజన్ జన్మదిన వేడుకలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, మండల వైద్యాధికారి హిమబిందు, నాయకులు వీరబ్రహ్మం, ప్రమాదదేవి, గండి తిరుపతి, సురేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణ సభకు తరలిరావాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కాటారం : పింఛన్ పెంపుపై కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును ఖండిస్తూ ఈ నెల 25న భూపాలపల్లిలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ నిర్వహించనున్న సభకు జిల్లాలోని దివ్యాంగులు, పెన్షన్‌దారులు అధిక సంఖ్యలో తరలిరావాలని వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణగౌడ్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ రాంచంద్రం కోరారు. మండలంలోని దేవరాంపల్లిలో బుధవారం దివ్యాంగులు, వృద్ధులు, గీతకార్మికులు, బీడీ కార్మికులు, చేనేత కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వితంతువులకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చిందని వాటిని అమలు చేయడం లేదని ఆరోపించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల చంద్రమౌళి, మండల అధ్యక్షుడు మంతెన చిరంజీవి, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ


స్టాక్ రికార్డును పరిశీలిస్తున్న ఏఓ, ఎస్సై

మల్హర్ : మండలంలోని కొయ్యూరు, మల్లారం, తాడిచర్ల గ్రామాల్లోని ఎరువుల దుకాణాల్లో కొయ్యూరు ఎస్సై నరేష్, తహసీల్దార్ రవికుమార్, మండల వ్యవసాయ అధికారి శ్రీజ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపుల్లోని స్టాక్ రిజిస్టర్, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసిన సమయంలో విధిగా రసీదు ఇవ్వాలని, దుకాణాల ఎదుట ధరల పట్టిక ఏర్పాటు చేయాలని వారు తెలిపారు. అక్రమంగా యూరియాను నిల్వ చేసిన, విక్రయించిన చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

యూరియా కొరత లేదు

రేగొండ : మండలంలో యూరియా నిల్వలకు కొరత లేదని ఏఓ వాసుదేవారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పీఏసీఎస్, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలను ఎస్సై సందీప్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. అలాగే కొత్తపల్లిగోరి మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను తహసీల్దార్ లక్ష్మిరాజయ్య, ఎస్సై దివ్యతో కలిసి ఏఓ సారయ్య తనిఖీ చేశారు.

రైతులకు పరిహారం చెల్లించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ములుగు రూరల్ : లక్నవరం, రామప్ప చెరువు కింద ముంపు బాధిత రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అంజాద్ పాషా కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో సీపీఐ మండల మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై తిరుగులేని పోరాటం చేస్తున్న పార్టీ సీపీఐ అని అన్నారు. బొగ్గుల వాగుపై ఆనకట్ట నిర్మించి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. జగ్గన్నగూడెం నుంచి కోటాయి, రాంపూర్ వరకు రోడ్డు నిర్మించాలని తెలిపారు. అనంతరం మండల కార్యదర్శిగా ముత్యాల రాజు, సహాయ కార్యదర్శిగా బోడ రమేశ్‌తో పాటు 14 మందితో కూడిన మండల కమిటీని ఎన్నుకున్నారు. నాయకులు కృష్ణ, నటరాజ్, సదయ్య, రమేష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.